క్లుప్తంగా

నేడు జగనన్నకు చెబుదాం

శ్రీకాళహస్తి: పట్టణంలో బుధవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించనున్నట్లు పురపాలకసంఘ కమిషనర్ రమేష్‌బాబు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఉదయం 9 గంటలకు పట్టణంలోని ఎస్‌ఎస్‌వీ కన్వెన్షనల్ హాల్లో కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అధ్యక్షతన జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వివరించారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో వినతులను అందజేయాలని ఆయన కోరారు.

పిచ్చాటూరులో ఎమ్మెల్యే పర్యటన రేపు

పిచ్చాటూరు: సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం బుధవారం మండలంలోని రామాపురంలో పర్యటించనున్నట్లు తహసీల్దార్ మధుసూదన్‌రావు తెలిపారు. అవయవదానంతో కొందరి జీవితాల్లో వెలుగులు నింపిన దాత కీర్తి కుటుంబాన్ని ఉదయం 9 గంటలకు రామాపురం దళితవాడలో ఆయన కలిసి రూ.5 లక్షలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

ముక్కంటికి ఆర్గానిక్ సొరకాయల వితరణ



ఆర్గానిక్ సొరకాయలు అందజేస్తున్న దాతలు

శ్రీకాళహస్తి: జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయానికి తొట్టంబేడు మండలం పూడి గ్రామానికి చెందిన జలగం గుణశేఖర్, తండ్రి జలగం బాలమురళి, కుటుంబ సభ్యులు మంగళవారం రూ.25వేలు విలువ చేసే 110కిలోల ఆర్గానిక్ సొరకాయలను వితరణ చేశారు. వీటిని పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు స్వీకరించారు.

విద్యార్థులకు అభినందన




విద్యార్థులను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ షెర్లీ

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఎల్‌ఐసీ కాలనీలో ఉన్న సెయింట్ జేవియర్స్ పాఠశాలకు చెందిన విద్యార్థులను మంగళవారం ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ షెర్లీ ఘనంగా సన్మానించారు. ఈ నెల 17వ తేదీ నెల్లూరులో జరిగిన నేషనల్ లెవల్ కరాటే పోటీల్లో పాఠశాలకు చెందిన క్లారిస్, ఆరాధ్య చాంపియన్‌షిప్ ట్రోఫీని సాధించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులను ఆమె ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శిక్షకుడు వాసు పాల్గొన్నారు.

రాష్ట్ర ఘట్కా పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ

రేణిగుంట: కాకినాడలో ఈనెల 16,17వ తేదీల్లో జరిగిన ఏపీ రాష్ట్ర ఘట్కా పోటీల్లో రేణిగుంట బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు సత్తా చాటారని హెచ్‌ఎం విష్ణువర్థనం మంగళవారం తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థినులను ఆమె మంగళవారం పాఠశాల ఆవరణలో ప్రత్యేకంగా అభినందించారు. ఉన్నత పాఠశాల ప్లస్‌కు చెందిన ఇంటర్ విద్యార్థినులు ఏడుగురు పోటీల్లో పాల్గొనగా, ఎం.సంజన, ఎస్.స్వాతి, కె.భారతి, ఈ.సౌమ్య బంగారు పతకాలు, ఎం.సుచిత్ర రజిత పతకాన్ని, ఉమా మహేశ్వరి, మణిమేఖల కాంస్య పతకాలను సొంతం చేసుకున్నట్లు ఆమె వివరించారు. వీరంతా అక్టోబర్‌లో ఢిల్లీలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలలో పాల్గొంటారని ఆమె తెలిపారు. పీడీ రేఖారాణి పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి దాడి



నిందితుడు బసవ

కేవీబీపురం: మండల కేంద్రంలో మతిస్థిమితం లేని ఓ వ్యక్తి మంగళవారం మద్యం మత్తులో హల్‌చల్ చేశాడు. దారిన వెళ్లే పాదచారులపై విచక్షణారహితంగా రాళ్లతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. ఈ ఘటనలో 9మందికి గాయాలయ్యాయి. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం అతడిని తిరుపతికి తరలించారు. స్థానికుల కథనం.. మండలంలోని కళత్తూరుకు చెందిన బసవ అనే వ్యక్తి స్థానికంగా మద్యం సేవించి తిరుగుతుంటాడు. అతనికి మతిస్థిమితం లేదని ప్రచారంలో ఉంది. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం స్థానిక మద్యం దుకాణానికి సమీపంలో మద్యం సేవించి అటుగా వచ్చిపోయే వారిపై రాళ్ల దాడికి దిగాడు. ఈ దాడిలో స్థానికులైన 9మంది తీవ్రంగా గాయపడగా.. వారిలో సాయికృష్ణ అనే యువకుని పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. బసవను స్థానికులు అతికష్టం మీద బంధించి పోలీసులకు అప్పగించారు. అయితే నిజంగా అతనికి మతిస్థిమితం లేదా? అనే కోణంలో విచారణ చేసిన పోలీసులు అతడిని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో మానసిక పరీక్షలకు తరలించారు.

వరదయ్యపాళెం : చిన్న పాండూరులో



వరదయ్యపాళెంలో..



నాగలాపురంలో..



పిచ్చాటూరులో..



నారాయణవనంలో..



హోమపూజల్లో ఎమ్మెల్యే బియ్యపు మధసూదన్‌రెడ్డి



గణనాథా నమోస్తుతే..!



నారాయణవనం : చవితి పూజల్లోఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం



నవసంధి వినాయకులకు సారెను తీసుకెళుతున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

సత్యవేడు: వినాయక చవితి పండుగను మండల ప్రజలు భక్తిప్రపత్తులతో జరుపుకున్నారు. ఆలయాలు, గ్రామాల్లో చలువ పందిళ్లలో వినాయక విగ్రహాలను కొలువుదీర్చి పూజలు చేశారు. ఇంటింటా మట్టి వినాయకుని ప్రతిమలే పూజలకు వినియోగించి, పాలవెల్లి పూజలు చేశారు. తొలుత పీట మీద ముగ్గు వేసి, బియ్యం పోసి, దాని మీద విఘ్నేశ్వరస్వామి ప్రతిమను ఉంచి, పై భాగాన పసుపు కుంకుమతో అలంకరించి పాలవెల్లిని కట్టారు. ఉండ్రాళ్లు, నైవేద్యం, చెరకు, పలు రకాలు పండ్లు, గరిక ఉంచారు. పిల్లల పాఠ్య పుస్తకాలు, పెన్నులు, వ్యాపారులు శ్రీ లక్ష్మీ అమ్మవారి చిత్రపటం, లెక్కల పుస్తకాలు ఉంచి 21 రకాల పూజాపత్రితో పూజలు నిర్వహించారు.

వరదయ్యపాళెం: మండలవ్యాప్తంగా వినాయక చవి తి ఉత్సవాలు అంబరాన్నంటాయి. 29 గ్రామ పంచాయతీల్లో పెద్దఎత్తున సోమవారం వినాయక విగ్ర హాలను ప్రతిష్ఠించి పూజలు చేశారు. మంగళవారం ప్రత్యేక పూజల అనంతరం అన్నదానం చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. త్రయంబకేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, వరదయ్యపాళెం గ్రామ పురవీధుల్లో స్వామివారి ఉత్సవమూర్తిని ఊరేగింపుగా తీసుకెళ్లారు. బుధవారం సాయంత్రం పలుచోట్ల నిమజ్జనోత్సవాలకు సిద్ధం చేస్తున్నారు.

పళ్లికొండేశ్వరస్వామి దేవస్థానంలో..

నాగలాపురం: సురుటుపల్లెలోని శ్రీ సర్వమంగళా సమేత శ్రీ పళ్లికొండేశ్వరస్వామి దేవస్థానంలో వినాయకస్వామికి పాలాభిషేకం, గణపతికి రుద్రహోమం, మహా అభిషేకం, మహా దీపారాధన కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం వినాయకస్వామి ఉత్సవ మూర్తులను అలంకరించి ఊరేగించారు. ఉత్సవమూరుల పుష్పాలంకరణకు ఉభయదాతగా వ్యవహరించిన జగన్నాథంను ఆలయ చైర్మన్ ఏవీఎం మునిశేఖర్ రెడ్డి సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన కార్యదర్శి కార్యదర్శి కె.రామచంద్రారెడ్డి, పాలక మండలి సభ్యులు కె.ఆనంద్, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వాడవాడలా కొలువుదీరిన బొజ్జగణపయ్యలు

పిచ్చాటూరు: మండల వ్యాప్తంగా గ్రామాల్లో సోమవారం వినాయకుని విగ్రహాలను కొలువుదీర్చి పూజలు చేశారు. పిండి వంటలను నైవేద్యంగా సమర్పించారు. కొన్ని గ్రామాల్లో లంబోదరుడిని ప్రత్యేకంగా అలంకరించి ఊరేగించారు. ఆయా గ్రామాల గ్రామ పెద్దలు, యువత పాల్గొన్నారు.

రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి : ఎమ్మెల్యే

నారాయణవనం: మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో వందకు పైగా వినాయకుని విగ్రహాలు ప్రతిష్ఠించి పూజలు చేశారు. స్థానిక నగరు వీధిలో వాణిజ్య సంఘం ఏర్పాటు చేసిన వినాయుని భారీ విగ్రహాన్ని సోమవారం ఉదయం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం దర్శించుకున్నారు. గణనాయకునికి ప్రత్యేక అర్చనలను నిర్వహించి, తీర్థ ప్రసాదాలను అందుకున్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలు సుఖశాంతులతో ఉండాలని ప్రార్థించినట్లు ఆయన చెప్పారు. అలాగే సముదాయంలోని టీటీడీ అనుబంధ శక్తి వినాయక స్వామిఆలయంలో ఉదయం సర్కారు అభిషేకాన్ని పూర్తి చేసిన అర్చకులు ధూప దీప నైవేద్యాలను సమర్పించారు. సాయంత్రం మూషిక వాహనాన్ని అధిరోహించిన శక్తి వినాయకస్వామి సముదాయం గ్రామ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. నారాయణవనం బస్టాండ్ సమీపంలోని వినాయక స్వామి ఆలయంలో ఉదయం అభిషేకాలు, అన్న ప్రసాద వితరణ చేశారు. రాత్రి ట్రాక్టర్‌పై సుందరంగా అలంకరించిన పూల ప్రభపై వినాయకుడు అధిరోహించి నారాయణవనం వీధుల్లో విహరించారు. ఏడవ రోజైన ఆదివారం నారాయణవనంలో ఏర్పాటు చేసిన విగ్రహాలనంటినీ సామూహికంగా నిమజ్జనం చేయడానికి అందరితో చర్చిస్తున్నట్లు వాణిజ్య సంఘం వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

జ్ఞానసిద్ధి వినాయకునికి హోమపూజలు

శ్రీకాళహస్తి: పట్టణంలోని గాంధీవీధిలో వెలసిన జ్ఞాన సిద్ధి వినాయకునికి సోమవారం ప్రత్యేక హోమపూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి హాజరై పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, జలకం కిషోర్, కొల్లూరు హరినాథ్‌నాయుడు, మొగరాల గణేష్, మధు, కొల్లూరు జయ, కుప్పయ్య, సుబ్బయ్య, బుగ్గ ప్రసాద్, పత్తి జగన్నాథం, సునీల్, హరి తదితరులు పాల్గొన్నారు.

జై గణేశా.. జైజై గణేశా..

శ్రీకాళహస్తి: మండలంలోని టీఎంవీ కండ్రిగలో సోమవారం వినియక చవితిని పురస్కరించుకుని ఏపీ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వడ్లతాంగల్ బాలాజీ ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని పానగల్, బీపీ అగ్రహారంలోని వినాయకులను ఆయన దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మునిరామిరెడ్డి, శ్రీను, శ్రావణ్, పవన్, బాలాజీ, పద్మ, సాయి పాల్గొన్నారు.

మేషరాశి వినాయకుడి సేవలో..

పట్టణంలోని ముత్యాలమ్మగుడివీధిలో ఏర్పాటు చేసిన మేషరాశి వినాయక స్వామిని మంగళవారం శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో నరసింహులు, రాజేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దకన్నలిలో..

తొట్టంబేడు మండలం పెద్దకన్నలిలో వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజలు చేశారు. గ్రామానికి చెందిన గురవారెడ్డి వినాయకుని లడ్డూను రూ.84 వేలకు వేలంలో దక్కించుకున్నారు. అనంతరం నిమజ్జనం చేశారు.

మట్టి ప్రతిమలనే పూజిద్దాం

మట్టి వినాయక ప్రతిమలనే పూజించి పర్యావరణాన్ని కాపాడుదామని ఆర్డీవో రామారావు అన్నారు. పట్టణంలోని ఎన్టీఆర్ పార్కు వద్ద వినాయకచవితిని పురస్కరించుకుని సోమవారం యువతరం సేవా సమితి ఆధ్వర్యంలో మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘం కమిషనర్ రమేష్‌బాబు, యువతరం సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

ఏర్పేడులో..

ఏర్పేడు: మండల వ్యాప్తంగా వినాయక చవితి వేడుకలు ఘనంగా జరిగాయి. గ్రామాల్లో యువకులు ఉట్టి కొట్టే కార్యక్రమాలు చేపట్టారు. కొన్ని గ్రామా ల్లో వినాయక నిమజ్జనం పూర్తి చేశారు. కొన్ని గ్రా మాల్లో 3 నుంచి 9 రోజులు పూజలు చేసిన అనంతరం నిమజ్జనం కార్యక్రమాలు చేపట్టనున్నారు.

రేణిగుంటలో చవితి సంబరాలు

రేణిగుంట: వినాయక చవితి సంబరాలు మండలంలో ఘనంగా నిర్వహించారు. వీధుల్లో గణనాధుని భారీ విగ్రహాలను ప్రతిష్ఠించి భక్తులు పూజలు చేశారు. రేణిగుంట రైల్వే స్టేషన్ సమీపంలో ఏర్పాటు చేసిన గణనాధుని వద్ద అన్నదానం చేశారు. మండలంలోని అత్తూరులో ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, తూకివాకం పంచాయతీ వినాయకపురంలో మాజీ జెడ్పీటీసీ తిరుమల రెడ్డి, మాజీ డీసీసీబీ చైర్మన్ సిద్దాగుంట సుధాకర్‌రెడ్డి గణనాథుని దర్శించుకుని అన్నదానం చేశారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

కేవీబీపురం: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం నిర్వహించనున్న వినాయక నిమజ్జనం కార్యక్రమాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఎస్‌ఐ సునీల్ తెలిపారు. వివాదాస్పద గ్రామాలుగా ఉన్న తిమ్మసముద్రం, పెరిందేశం, అంజూరు, రాగిగుంట, కాళంగి తదితర గ్రామాల్లో ఒకేసారి ఒక విగ్రహాన్ని మించి నిమజ్జన కార్యక్రమం చేపట్టకూడదని, డప్పులు, బాణసంచా ఉపయోగించకూడదని, నిమజ్జన కార్యక్రమాలను ముందుగా పోలీసులకు తెలియజేయాలన్నారు. నాలుగేళ్లగా వినాయక చవితి వేడుకల్లో ఎక్కువగా గొడవలు చోటుచేసుకుంటున్నాయని, దీనిని దృష్టిలో ఉంచుకుని ఆంక్షలు విధిస్తున్నట్లు చెప్పారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పెరిందేశం, తిమ్మసముద్రం, అంజూరు గ్రామాల్లో బ్లూకోల్ట్ పోలీసులతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామన్నారు.

నవసంధి వినాయకులకు ముక్కంటి సారె

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నాలుగు మాడవీధుల్లో వెలసిన నవసంధి వినాయకులకు సోమవారం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో ముక్కంటి సారెను సమర్పించారు. మొదట ఆలయంలోని అలంకార మండపంలో విశేష పూజలు నిర్వహించి అనంతరం మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ సారెను ఊరేగింపుగా తీసుకుని నాలుగుమాడవీధుల్లోని నవసంధి వినాయకులకు సమర్పించారు. ఆయా ఆలయ అర్చకులు స్వీకరించి వాటిని స్వామివారికిధరింపజేసి విశేష పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు శ్రీదేవి, అధికారులు పాల్గొన్నారు.

ఏర్పేడు: పాపానాయుడుపేటలో ..





శ్రీకాళహస్తి: వినాయకునికి పూజలుచేస్తున్న వడ్లతాంగల్ బాలాజీప్రసాద్‌రెడ్డి



శ్రీకాళహస్తి: వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న ఆర్డీవో రామారావు, కమిషనర్ రమేష్‌బాబు









శ్రీకాళహస్తి: పూజల్లో అంజూరు తారక శ్రీనివాసులు తదితరులు, గ్రామోత్సవంలో యువకులు, ఏర్పేడు: మర్రిమందలో వినాయకుడిని కొలువుదీర్చి పూజలు నిర్వహిస్తున్న గ్రామస్తులు, రేణిగుంట: వినాయకనగర్‌లో గణనాథుని సేవలో నాయకులు

ఆత్మీయ నేతకు ఘన స్వాగతం







సీఎంకి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే, నాయకులను సీఎంకు పరిచయం చేస్తున్న బియ్యపు పవిత్రారెడ్డి, సీఎంకు స్వాగతం పలుకుతున్న సుమన్‌కుమార్

రేణిగుంట: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తిరుపతి, తిరుమల పర్యటన సందర్భంగా రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు సోమవారం మధ్యాహ్నం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు ఓడూరు గిరిధర్‌రెడ్డి, శ్రీకాళహస్తి మాజీ మున్సిపల్ చైర్మన్ ముత్యాల పార్థసారథి, పేరూరు పురుషోత్తంరెడ్డి తదితరులు స్వాగతం పలికారు. మంగళవారం ఉదయం వీడ్కోలు సందర్భంగా ఆయనకు ఎమ్మెల్యేతోపాటు బియ్యపు పవిత్రారెడ్డి, బియ్యపు ఆకర్ష్‌రెడ్డి, రేణిగుంట ఉప సర్పంచ్ ఇర్ఫాన్, రసూల్,బాల, ఇన్బనాధన్ తదితరులు సీఎంకు వీడ్కోలు పలికారు.

నారాయణవనం: రేణిగుంట విమానాశ్రయంలో సోమవారం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు సుమన్‌కుమార్ పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. తిరుపతి, తిరుమల పర్యటనకు వచ్చిన సీఎంను విమానాశ్రయంలో సుమన్ కలిసి సాదర స్వాగతం పలికారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'పై శిక్షణ



మాట్లాడుతున్న మండల జేసీఎస్ కన్వీనర్ మోహన్ మొదలియార్

నాగలాపురం: మండల కేంద్రంలోని కృష్ణాపురం, యస్‌యస్ పురం గ్రామ సచివాలయంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్షపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండల జేసీఎస్ కన్వీనర్ బి.మోహన్ మొదలియార్ మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. వలంటీర్లు ఇంటింటా సర్వే నిర్వహించి, ప్రజల ఆరోగ్య సమస్యలను గుర్తించి, వాటిని యాప్‌లో నమోదు చేయాలన్నారు. అనంతరం నిర్దేశించిన తేదీలో నిర్వహించే వైద్య శిబిరంలో వారికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేయడం ఈ కార్యక్రమం ఉద్దేశమన్నారు. ఎంఎల్‌ఓ చంద్ర, సర్పంచ్ మహేంద్రన్, ఏఎన్‌ఎంలు, సచివాలయ కన్వీనర్ శ్రీనివాసులు రెడ్డి, అశ్విని, దేవా, గృహ సారథులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మండల కో-ఆప్షన్ సభ్యుడు మృతి



సుభాన్‌రాజ(ఫైల్)

రేణిగుంట: పట్టణానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, మండల కో–ఆప్షన్ సభ్యుడు ఎస్.సుభాన్‌రాజ(50) అనారోగ్యంతో మంగళవారం హఠాన్మరణం చెందారు. ఆయనకు గత కొంత కాలంగా ఆరోగ్య సమస్యలు తలెత్తడంతో ఇటీవల శస్త్ర చికిత్స చేయించుకున్నారు. మంగళవారం తెల్లవారుజామున మృతి చెందడంతో పార్టీ శ్రేణులు దిగ్భ్రాంతికి గురయ్యారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, మండల ఇన్‌చార్జి బియ్యపు పవిత్రారెడ్డి, ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీ సంధ్యారాణి ఆయన మృతి పార్టీకి తీరని లోటని విచారం వ్యక్తం చేశారు. మాజీ జెడ్పీటీసీ తిరుమల రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, రేణిగుంట సర్పంచ్ నగేషం, ఖదీర్ తదితరులు ఆయన పార్థివ దేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు.

పారిశుధ్య కార్మికులకు అన్నదానం



బిర్యానీ ప్యాకెట్లు అందిస్తున్న సర్పంచ్ నగేషం

రేణిగుంట: స్థానిక పంచాయతీలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు మంగళవారం సర్పంచ్ నగేషం చేతుల మీదుగా అన్నదానం అందజేశారు. ఎంపీహెచ్‌వో మురళి తండ్రి అంకం నాగరాజు వర్థంతిని పురస్కరించుకుని పారిశుధ్య కార్మికులకు ఈ క్యారియర్ బాక్సులు, బిరియానీ ప్యాకెట్లు పంపిణీ చేశారు. విజయలక్ష్మి, సాయి సుమంత్, చేతన సాయి, రమణ, వార్డు సభ్యులు ఇరానీ ఖాదర్, ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ వంద రోజుల పని



పూడికతీత పనులను పరిశీలిస్తున్న డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస్ ప్రసాద్

సత్యవేడు: ఉపాధి పనుల్లో కూలీలు సంఖ్య పెంచాలని, ప్రతి కుటుంబానికీ 100 రోజులు పని కల్పించాలని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస్ ప్రసాద్ ఆదేశించారు. సోమవారం మండలంలోని ఆంబాకం పంచాయతీలో చెరువు పూడికతీత పనులను ఆయన పరిశీలించారు. రూ.9 లక్షలతో చెరువు పనులకు ప్రతిపాదించామని, 1400 మంది కూలీలకు పని కల్పిస్తున్నట్లు జేఈ సుమలత ఆయనకు తెలిపారు. కార్యక్రమంలో ఏపీడీ ప్రేమ్‌కుమార్, టెక్నికల్ అసిస్టెంట్ మనోహర్, ఫీల్డ్ అసిస్టెంట్ అరుణ తదితరులు పాల్గొన్నారు.

చట్టసభల్లో 33శాతం మహిళా రిజర్వేషన్‌పై హర్షం



కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్

సత్యవేడు: మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ తీసుకు వచ్చిన ఘనత ప్రధాని మోదీకే దక్కుతుందని మండల బీజేపీ అధ్యక్షుడు ముని ప్రతాప్ అన్నారు. ప్రధాని మోదీ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలపై సోమవారం సత్యవేడులో బీజేపీ నాయకులు ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ, ఆయుష్మాన్ భారత్ పథకం ప్రతి సామాన్యునికి అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి మునిశేఖర్, ఎస్సీ మోర్చా తిరుపతి జిల్లా అధ్యక్షుడు మునికృష్ణయ్య, మాజీ ఎంపీటీసీ మోహన్‌బాబు, చెంచయ్య, కోటీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నరసింహస్వామికి ప్రత్యేక పూజలు



విశేష అలంకరణలో లక్ష్మీ నరసింహస్వామి

నారాయణవనం: మండలంలో సింగిరికోనలోని లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో మంగళవారం అభిషేకాలను, హోమాలను నిర్వహించారు. నరసింహస్వామి జన్మ నక్షత్రాన్ని పురస్కరించుకుని మంగళవారం ఉదయం 10 గంటలకు శ్రీదేవీ, భూదేవీ సమేత లక్ష్మీ నరసింహస్వామి మూలమూర్తులకు అభిషేకాలను నిర్వహించారు. వెండి కవచాలు, సుగంధ పుష్పాలతో అలంకరించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో గణపతి, నవగ్రహ, సుదర్శన, ధన్వంతరి, మహా విష్ణు హోమాలను ఆగమోక్తంగా నిర్వహించి పూర్ణాహుతిని సమర్పించారు. భక్తులకు వస్త్ర బహుమానం ఇవ్వడంతోపాటు తీర్థ ప్రసాదాలు, అన్నప్రసాదాల వితరణ చేశారు. ట్రస్టీ సభ్యుడు గిరిబాబు మాట్లాడుతూ, ప్రతి పౌర్ణమి రోజున ఉభయ నాం చారులతో లక్ష్మీ నరసింహస్వామికి కల్యాణోత్సవం నిర్వహిస్తామన్నారు.ఆలయానికి వచ్చే భక్తులకు మూడు పూటలా అన్న ప్రసాదాలను నిత్య అన్నదానసత్రంలో అందచేస్తున్నట్లు తెలిపారు.